క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


కోట ప్రసాద్

కౌటాల: కౌటాల ఎంపీడీవోగా కోట ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన నస్రుల్లాఖాన్ బదిలీపై వాంకిడి వెళ్లారు. చింతలమానెపల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కోట ప్రసాద్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతల అనంతరం ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ, కార్యదర్శులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్టీయూ మండల నూతన కమిటీ

సిర్పూర్(టి): పీఆర్టీయూ మండల నూతన కమిటీని జిల్లా నాయకులు శ్రీనివాస్, దేవాజి సమక్షంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మేడి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎల్లల శ్రీకాంత్, అసోసియేట్ అధ్యక్షుడిగా కుడిమెత సీతారాం, మహిళా ఉపాధ్యక్షురాలిగా జయశ్రీ, కార్యదర్శిగా దుర్గం అనిల్ ఎన్నికయ్యారు. నాయకులు ఇందారపు ప్రకాశ్, శ్రీకాంత్, అనిల్ సహదేవుడు, వెంకటరమణ, సుధాకర్, పవన్, జ్యోతి, చిన్న అంకు, సరిత, షబానాబేగం, యాస్మిన్ పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ


విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న సభ్యులు

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మంగళవారం ఆల్ ఇండియా ఐడల్ టీచర్స్ అసోసియేషన్(ఐటా) ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం సాంబశివుడు, హెచ్‌ఎం మజర్ హుస్సేన్, ఐటా సిర్పూర్(టి) యూనిట్ అధ్యక్షుడు అజీజ్ ఖాన్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఇఫాత్‌హుస్సేన్, సీఆర్పీ పవన్‌కుమార్, ఉపాధ్యాయురాలు షహనా సుల్తానా పాల్గొన్నారు.

స్థానికేతర ఉపాధ్యాయులను బదిలీ చేయాలి


సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో సుమారు 900 మంది స్థానికేతర ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, వారిని వెంటనే సొంత జిల్లాలకు బదిలీ చేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడె ప్రకాశ్ అన్నారు. జైనూర్ మండలంలో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. 2004 నుంచి ప్రవేశపెట్టిన సీపీఎస్ రద్దు చేయాలని, సమగ్ర శిక్ష, గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రతి మండలానికి రెగ్యులర్ ఎంఈవో పోస్టు మంజూరు చేయాలన్నారు. అనంతరం బెజ్జూర్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆత్రం దత్తు, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా రోహిదాస్, మహిళా కార్యదర్శిగా సురేఖ ఎన్నికయ్యారు.

నేడు సమావేశం

కౌటాల: మండల కేంద్రంలోని డా.బీఆర్ అంబేద్కర్ భవనంలో బుధవారం ఎస్సీ వర్గీకరణపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్సీ వర్గీకరణ కమిటీ నాయకులు కర్మి ఏమాజీ మంగళవారం తెలిపారు. సమావేశంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన ఆందోళన కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మహార్, నేతకాని, మాల కులస్తులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ సీహెచ్‌సీలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీ ఎదుట మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, శ్రీశైలం, మల్లేశ్, సత్తార్, మురళి, మమత, నీల, గుణవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జవాన్ మృతిపై సంతాపం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన మున్సిపల్ శానిటరీ జవాన్ కాసర్ల శ్రీనివాస్ (57) అనారోగ్యంతో మృతి చెందగా, ఎమ్మెల్యే హరీశ్‌బాబు మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

బీమా.. ఏదీ ధీమా?

- నాలుగేళ్లుగా పంటల బీమాపై స్పష్టత కరువు
- అతివృష్టి, అనావృష్టితో పంటలకు తీవ్ర నష్టం
- రైతులకు అందని పరిహారం


ఈచిత్రంలో ఉన్నది రైతు జాడే ప్రభాకర్. ఈయన స్వగ్రామం కౌటాల మండలం వీర్దండి. తన మూడెకరాల్లో ఇటీవల మిర్చి, పత్తిసాగు చేశాడు. వార్ధా నది పొంగడంతో చేలలోకి వరదనీరింది. మూడురోజులుగా వరదనీటిలో మునిగిఉండడంతో మిర్చి మొక్కలు కుళ్లిపోయాయి. పలుచోట్ల పత్తి మొక్కలు వడిలిపోయాయి. రూ.లక్షల్లో నష్టం జరిగింది. ప్రభుత్వం పరిహారం అందించాలని రైతు కోరాడు.


పత్తి పంటల్లో చేరిన వరదనీరు

కౌటాల: కష్టాన్నే నమ్ముకుని ముందుకు 'సాగు'తున్న రైతుకు అడుగడుగునా అవాంతరాలే ఎదురవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టితో ఏటా పంటలకు తీవ్ర నష్టం జరగకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకం అమలు కావడం లేదు. పథకం అమలుకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకివచ్చాక అమలు చేస్తామన్న పంట బీమాపై స్పష్టత కరువైంది. జిల్లాలోని 335 పంచాయతీల్లో 1.20 లక్షల మందికి పైగా రైతులున్నారు. ఏటా వానాకాలం సీజన్‌లో సుమారు 4.50 లక్షలకుపైగా ఎకరాల్లో వివిధపంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో అధికంగా పత్తి 3.40 లక్షల ఎకరాల్లో సాగు కాగా, వరి, కంది, పెసర, మినుము, మొక్కజొన్న, సోయా, శనగ, మిర్చి పంటలు పండిస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలకు తెగుళ్లసోకి దెబ్బతింటున్నాయి.

ఏటా నష్టాలే..

సిర్పూర్ నియోజకవర్గంలోని ప్రాణహిత, వార్ధా పరీవాహక ప్రాంత రైతులకు ఏటా కన్నీరే మిగుల్చుతోంది. జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు మిర్చి,

ఖరీఫ్ కాలం సాగు ప్రణాళిక

పంట	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
పత్తి	3,40,000
వరి	62,209
కంది	38,239
సోయాబీన్	6,089
పెసర	1700
జొన్నలు	680
మొక్కజొన్న	742
మినుము	163
వేరుశనగ	178
మొత్తం	4,50,000

పత్తి, వరిపంటలు దెబ్బతిన్నాయి. వరదలు తగ్గినా పంట చేలల్లో బురదే మిగిలింది. గతనెలలో భారీ వర్షాలకు ప్రాణహిత ఉప్పొంగింది. వరద కారణంగా బెజ్జూర్‌లో 1500 ఎకరాలు, దహెగాంలో 1880 ఎకరాలు, పెంచికల్‌పేట్‌లో 850 ఎకరాలు, చింతలమానెపల్లిలో 590 ఎకరాల్లో నష్టం జరిగింది. తాజాగా రైతులు మిర్చి మొక్కలు నాటారు. ప్రస్తుత భారీ వరదల కారణంగా మిర్చిపంటల్లో ఇసుక, మట్టి మేటలువేయగా, పలు మొక్కలు కొట్టుకుపోయాయి. ప్రస్తుతం కౌటాల మండలం తాటిపల్లిలో వంద ఎకరాలకు పైగా మిర్చి, పత్తి, వరి పంటలు నీట మునిగి ఉన్నాయి. వీర్దండి, గుండాయిపేట్, బాలేపల్లి శివారులోని 250 ఎకరాలకు పైగా మిర్చి పంట నీట మునిగింది.

రైతుకు ఏది ధీమా?

అతివృష్టి, అనావృష్టితో దెబ్బతిన్న పంటలకు కేంద్ర ప్రభుత్వం ఫసల్‌బీమా యోజన పథకం కింద రైతులకు పరిహారం చెల్లిస్తోంది. గత బీఆర్ఎస్ నాలుగేళ్లుగా ఫసల్‌బీమా పథకాన్ని అమలు చేయలేదు. గతంలో పంట రుణాలు తీసుకునే రైతుల నుంచి బ్యాంకర్లు ముందుగానే బీమా డబ్బులు జమ చేసుకుంటున్నాయి. ఎకరా పత్తికి రూ.1,700, వరికి రూ.1,200, ఇతర అన్ని రకాల పంటలకు రూ.300 నుంచి రూ. 500 వరకు ప్రీమియం వసూలు చేశాయి. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే కంపెనీలు పంటనష్టంలో 80 శాతం డబ్బును రైతులకు పరిహారం చెల్లించేవి. గత నాలుగేళ్లుగా బీమా సొమ్ము తీసుకోకపోవడంతో అన్నదాతలునిరాశలో ఉన్నారు. ఫసల్ బీమా పథకం అమలుకాకపోవడం, ఇటీవల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందే అవకాశాలు కనిపించడం లేదు.

ఏటా నష్టపోతున్నాం


అతివృష్టి, అనావృష్టితోపాటు పంటలకు తెగుళ్ల ఆశించిన నష్టం వాటిల్లుతోంది. వరదల కారణంగా ఏటా వార్ధా, ప్రాణహిత పరీవాహక రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పంటల బీమా వర్తింపజేయాలి. –బాజీరావు, రైతు, మొగడ్‌దగడ్

ఆదేశాలు రాలేదు

ఏటా వరదల కారణంగా ప్రాణహిత, వార్ధా నదుల సరిహద్దులోని రైతులు పంటలు దెబ్బతింటున్నా మాట వాస్తవమే. పంటల బీమా పథకంపై ప్రభుత్వం నుంచి ఎలాంటిఆదేశాలు రాలేదు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ఈ ఏడాది అమలు చేయలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తేనే బీమా సొమ్ము తీసుకుంటాం.
–మధులత, ఇన్‌చార్జి ఏవో, కౌటాల

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్ బాబు

కాగజ్‌నగర్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని ప్రారంభించారు. బ్రహ్మకుమారిలు, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి అన్నారు. మంగళవారం ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాలలో నషా ముక్త్ భారత్, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు పద్మ, కైవల్య, లలిత, నందలు డ్రగ్స్ వినియోగంపై వాటి దుష్ప్రభావాల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దత్తాత్రేయ, అధ్యాపకులు శారద, జనార్దన్, కృష్ణవేణి, సంతోశ్, దేవేందర్, మహేశ్, మహాలక్ష్మయ్య, రాజేశ్వర్, టేమాజీ పాల్గొన్నారు.

నీరు నిల్వలేకుండా చూడాలి


మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న డీపీవో

దహెగాం: గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. మండలంలోని ఐనం, చినరాస్పెల్లి, బామానగర్, బొర్లకుంట గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ జ్వరం వస్తే తప్పనిసరిగా పీహెచ్‌సీకి వెళ్లాలని సూచించారు. గ్రామాల్లో వర్షపు, మురుగు నీరు నిలిస్తే దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయని, తద్వారా వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమవేశం నిర్వహించారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో రాజేందర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి పంచాయతీలోని సీబాబుకాలనీతో పాటు కోయవాగు, పర్దాన్‌గూడ, అంకుసాపూర్ గ్రామాల్లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 454 మందికి సాధారణ పరీక్షలు, జ్వరంతో బాధపడుతున్న 30 మంది నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు హెల్త్ సూపర్‌వైజర్ శారద తెలిపారు. సీబాబు కాలనీలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు. ఏఎన్ఎంలు పద్మ, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, ప్రణవి, శ్రీదేవి, లక్ష్మి, విజయలక్ష్మి ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: ఖాళీ ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కైర్‌గాం గ్రామస్తులు డీఈవో అశోక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో వారు నష్టపోతున్నారన్నారు. గణితం, సైన్స్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తులు వెంకటరమణ, వెంకటేశ్, హెచ్‌ఎం గోపాల్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

బెజ్జూర్: మండల కేంద్రంలోని సర్వే నం.237, 760/ 55 ప్రభుత్వ భూములు కబ్జాలకు గురై అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారని స్థానికులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మల్లేశ్, హకీం, సల్మాన్, షణ్ముఖ, మార్డిడి మాజీ సర్పంచ్ ఉమ్మేరి లింగయ్య తహసీల్దార్ భూమేశ్వర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. పారిపోయిన విద్యార్థి

- మైనార్టీ గురుకుల పాఠశాలలో ఘటన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బలగల శివారులో గల తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల–1 నుంచి ఓ విద్యార్థి పారిపోయాడు. మంగళవారం ఈ ఘటన వెలుగు చూసింది. రెబ్బెన మండలం గోలేటికి చెందిన ముజాఫర్ బలగలలోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. అయితే ఆ విద్యార్థి ఆదివా రం అర్ధరాత్రి పారిపోయి 5 కి.మీ కాలినడకన కాగజ్‌నగర్‌లోని ఓల్డ్‌కాలనీలో అమ్మమ్మ ఇంటికి తె ల్లవారుజాము చేరుకున్నాడు. కుటుంబీకులు భ యాందోళనకు గురయ్యారు. టీచర్లు, వాచ్‌మెన్ నిర్లక్ష్యంతోనే విద్యార్థి పారిపోయాడని పలువురు పే ర్కొంటున్నారు. మంగళవారం విద్యార్థి కుటుంబీకులు పాఠశాలకు వెళ్లగా సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. పాఠశాలలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్నారు. ఈ విషయమై ఆర్ఎల్‌సీ పుష్పలతను వివరణ కోరగా సమగ్ర విచారణ చేపడుతానన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేశ్ నవరాత్రులు


అన్నదానంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వేణు


అన్నదానం చేస్తున్న సతీశ్ దంపతులు

ఆసిఫాబాద్/కెరమెరి/కాగజ్‌నగర్‌రూరల్/ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. టీఎన్‌జీవో కాలనీలో అన్నదాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు పాల్గొని భోజనం వడ్డించారు. జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో మండపం వద్ద మహిళలు మంగళహారతులతో హాజరయ్యారు. సాయినివాడలోని శివసాయి గణేశ్ మండలి వద్ద గణనాథుడికి లక్ష వస్త్రంతో అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. గుండి రహదారిలోని సాయినగర్ గణేశ్ మండలి వద్ద అన్నదానం చేపట్టారు. కెరమెరి మండలంలోని గణేశ్ మండపాల వద్ద పూజలు చేశారు. కాగజ్‌నగర్‌లోని కాపువాడలో భజరంగ్‌దళ్ గణేశ్ మండలి వద్ద అన్నదానం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ–327 విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎమ్మాజీ సతీశ్ సుజాత దంపతులు గణనాథునికి పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. జిల్లా కేంద్రంలోని బాపూనగర్ శారదా గణేశ్ మండలి వద్ద వినాయకుడికి గరకతో గజమాల దండల పోటీలు నిర్వహించారు.మ హిళలు వివిధ పువ్వులు, గరక దండలను అల్లుకుని పోటీలో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ బహుమతి సాధన, ద్వితీయ బహుమతి స్వప్న, మూడో బహుమతి నాగలక్ష్మి దక్కించుకున్నారు. న్యాయనిర్ణేతలుగా అన్నపూర్ణ, రజని వ్యవహరించారు.


వాసవీ మందిరం మండపం వద్ద..


కెరమెరి: సేవాదాస్‌నగర్‌లో పూజలు చేస్తూ..

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి


బెజ్జూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

బెజ్జూర్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐలమ్మ ఆశయసాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దేవనపల్లి నరేందర్, రాకేశ్, రాములు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలో రజక సంఘం మండల అధ్యక్షుడు బూసి సంతోశ్..ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ తో పాటు జిల్లా కేంద్రంలో ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం కోశాధికారి దుర్శెట్టి సతీశ్, ఉపాధ్యక్షులు నల్లూరి రాజు, బూసి మల్లేశ్, నల్లూరి సాగర్, అరుణ్, రవి, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కౌటాల: కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు, అధ్యాపకులు రజిత, సుజాత, భాగ్యలక్ష్మి, శ్రీవాణి, తస్లీమ బేగం, ఆంజనేయులు, అశోక్‌రాజ్, రాజ్యం, రాము, రాంబాబు, రాందాస్, శ్రీనివాస్ నాయక్, ప్రకాశ్, రవీందర్, రంజిత్, పాపయ్య పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతి ఒక్కరూ చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం రాష్ట్ర నాయకులు భీంరావ్, నాయకులు పురుషోత్తం, బాలేశ్, వైరాగడె మారుతి, శంకర్, సాయి, బలరాం, తిరుపతి, జక్కయ్య పాల్గొన్నారు.


తిర్యాణి: నివాళులర్పిస్తున్న నాయకులు



కౌటాల: కళాశాలలో నివాళులర్పిస్తూ..

15న ఉచిత వైద్యశిబిరం

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజాబంధు దివంగత మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తమరావు 25వ వర్ధంతి సందర్భంగా ఈనెల 15న మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్‌బాబు తెలిపారు. పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో ఉదయం 9 నుంచి ఈ శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 20 మంది డాక్టర్ల ఆధ్వర్యంలో సాధారణ వైద్యం, శస్త్రచికిత్స, స్త్రీల సంబంధిత, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్లు, పిల్లలు, గుండె, కిడ్నీ, మూత్రాశయ, నరాలు, ఉదరకోశ వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిచ్చిమొక్కలు తొలగింపు


జేసీబీతో చదును చేయిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని గొడవెల్లి పెద్దవాగు పరిసర ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావ్ పర్యవేక్షణలో మంగళవారం చదును చేయించారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగింపజేశారు. సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

'నషా ముక్త్ భారత్'యాత్ర జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: నషా ముక్త్ భారత్ అభియాన్ జాగృతి యాత్రను జయప్రదం చేయాలని బ్రహ్మకుమారీ ఈశ్వరియా విశ్వవిద్యాలయం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. యాత్రలో భాగంగా బుధారం ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకుంటుందన్నారు. విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

శాంతియుతంగా కార్యక్రమాలు నిర్వహించాలి


నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై విజయ్

కెరమెరి: ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్సై విజయ్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివాసీ సంఘాల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 12 ఉదయం ఆదివాసీ మహిళలతో నల్ల బ్యాడ్జీలతో శాంతయుత ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు సమర్పిస్తామన్నారు. 30 వరకు దశలవారీగా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఏ కార్యక్రమం నిర్వహించిన ఎలాంటి అలజడిలు సృష్టించకుండా నిర్వహించాలని ఎస్సై తెలిపారు. వివిధ సంఘాల నాయకులు భరత్‌భూషన్, ఇందిరా, పెందోర్ మోతిరాం, భీంరావు, కనక ప్రభాకర్, రాము, దుందేరావు, జగన్నాథ్‌రావు, రాజేశ్వర్, జగన్నాథ్‌రావు, లక్ష్మణ్, రఘునాథ్, సోము తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. మండలంలోని చిర్రకుంట, తుంపెల్లి ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో జిల్లా విద్యార్థులు సత్తా చాటాలని సూచించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం సుభాష్, సీఆర్పీ నగేశ్ పాల్గొన్నారు.